# దర్గామిట్ట కతలు

## నను తాకేసిందిరా 'కాలాజాన్వర్'




'రెరెరేయ్... తొయ్యబాకరా... తొయ్యబాకా... రెరెయ్... నీయవ్వా దొంగనాయాలా...' అన్నాను ఏడువుమొకం పెట్టి.

పొళ్లన్నీ అవుపడేలా 'కిక్కికిక్కికిక్కి' అని నవ్వతా ఉన్నాడు సతీష్ సింగ్ గాడు– నన్ను పంది మీదకి తోసేసి.

ప్రెతిసారీ వాడికిదో కిండలు!

ఇస్కూలు యిడిచినాక నా మానన నేను యింటికి పోతా ఉంటే నా పక్కనే నడిచినట్టుగా నడిచి పంది మీదకి నెట్టేస్తా ఉంటాడు.

నేను అదిరిపడి పక్కకి దూకి – క్యావుబ్యావుమంటా అటూ ఇటూ ఎగరతా ఉంటే వాడికి తమాషా.

కానీ ఎన్నిసార్లని తప్పించుకునేది?

ఈసారి వాడు తొయ్యడానికీ నేను అరవడానికీ సరిగ్గా సరిపోయి, గమ్మున పోతా ఉన్న పందికి కూడా బెదురువుట్టి, తత్తరలో ఎటుపోవాలో తెలీక మీదకొచ్చేసిందది. ఆ రావడం రావడంలో దాని కడువు నా కాలిని తాకేసింది!

పస్టు 'పచక్'మని చిమ్మింది బురద!

ఆనేక దాని బొచ్చుబొచ్చు తడి చర్మం మెత్తగా నా ఒంటికి రుద్దుకొనింది.

అబ్బా నాయినా!.. అవ్వుడు నా ఒంట్లో వికారం వుట్టింది చూడూ... కింద నుంచి పైదాకా చర్మమంతా ముళ్లు వుట్టి పగిలేసినట్టు, ఎవురో నా కడువులో చెయ్యి పెట్టి లొడలొడమని లోడేసినట్టు, గొంతులోకి ఏదో బుసబుసమని పొంగేసినట్టు అనిపించి వాంతికొచ్చేసింది!

గబుక్కున ఏ బావిలోనైనా దూకి శుబ్రం చేసేసుకుందామా అన్నంత కోరిక వుట్టింది ప్రాణానికి.

నాకు తెలియకుండానే కళ్లమ్మట నీళ్లు తిరిగినాయి. ఏడుపొచ్చేసింది!

నా ఏడువ్వూ నా అగచాట్లూ చూసే సరికి సతీష్ సింగ్‌గాడి మొకంలో నవ్వుమాయమైపోయింది.

నా దెగ్గరకొచ్చి 'ఐ యాం సారీరా... ప్లీజ్‌రా... సారీరా... పదరా కుళాయికాడకెళ్లి కడుక్కుందూ గానీ' అన్నాడు బుజం మీద చెయ్యివేస్తా.

వాడి నంగమాటలకి యింత పొడుగున పొడుచుకొచ్చేసింది పౌరుషం!

'చేసింది చాలుగానీ ఒదులొరే దొంగనాయాలా. యివ్వుడు కాదు నీ పని... రేవు చెబుతా. మాల్యాద్ర యివోరితో చెప్పి నీ పని వాంవూస చేయించకపోతే అవ్వుడు చూడయ్యా...' అని, ఏడ్చుకుంటానే యింటిదారి పట్టినాను.

దారి పొడుగూతా నా బాద బాద గాదు. మనసులో ఏందేందో బియాలు.

'పంది తాకితే బలే దోషం సామీ. ఏడు బావుల నీళ్లతో స్నానం చేస్తేగానీ ఆ దోషం పోదు' అని మా యాదిలోని పిలకాయలు చెప్తా ఉండిన మాటలు గెవనానికి వస్తా ఉన్నాయి.

వాళ్ల లెక్క ప్రకారమైతే మా కసాబ్ గల్లీలో ఏడు బావులు యాడాడ ఉన్నాయా అని లెక్కేసినాను కాసేవు.

మళ్లా... షమ్మీ వాళ్ల అన్న ఖాదర్ బాషా గుర్తుకొచ్చినాడు. వాణ్ణొకసారి పంది తాకిందని తెలిసినవ్వుడు వాళ్లమ్మ ఖుర్షీద్‌బీ మూడు పగళ్లూ మూడు రాత్రిళ్లూ సత్తెనాశినం తిట్లు తిడతానే ఉంది.

'అయి పొర్లేకాడ ఆడతావా? ఆడతావా?' అంటా వాడి చమిడీ వొలిచేసి వొదిలిపెట్టింది.

(ఖుర్షీద్‌బీ పందిని 'పంది' అనదు. ఆమే కాదు మాలో చాలా మంది క్కూడా 'పంది' అనే పదాన్ని నేరుగా నోటి మీదకి తేరు. ఆ మాట పలకడం కూడా మాలో నిషిద్దమన్నమాట. ఒకేళ. దాని ప్రస్తావన తేదలిస్తే 'కాలా జాన్వార్' అంటారు. అంటే నల్లజంతువు–పంది అని అర్దం).

ఆ తన్నులు గుర్తుకొచ్చేసరికి బలే బయమైపోయింది నాకు. అసలికి యీ సంగతి యింట్లోనే చెప్పకపోతే? అని అనిపించింది.

మళ్లా అనుమానం. ఏమో... ఎందుకొచ్చిన దోషం. యిట్టాంటివి యింట్లో చెప్పి ప్రాయచ్చిత్తం చేయించుకోకపోతే స్వొర్గద్వారాలు మన కోసం శాశ్వితంగా గెడియపడితోతాయేమో కదా! అని పరలోక బీతి వచ్చింది.

ఆఖరకు ఎట్టయితే ఏమి– పంది తాకిందన్న సంగతి యింట్లో చెప్పి తీరాల్సిందే అని నిచ్చయించుకొని యింటికి చేరినాను. అయితే ఎమ్మట్నే గడపలోకి అడుగు పెట్టలేదు.

'మ్మోవ్...అమోవ్' అన్నాను బయిట్నించి.

నా కేక విని మా నాయినమ్మ బయిటికొచ్చింది.

నా ఏడువు మొకం, కాలి కంటిన బురదా చూసి 'ఏందిరా నాయినా... ఏందో చేసుకొచ్చినావే' అంది గాబరాగా.

నేను బయం బయంగా మొకం పెట్టి, గోర పాపమేదో చేసిన వాడిలా 'పంది తాకేసింది మా' అన్నాను.

'అరి మౌలా... తాకేసిందా! అణ్ణే ఆగు. లోపలికి రాబాకా' అని గబగబా యింట్లోకి వెళ్లింది.

కర్ర తీసకొచ్చి బాదిపార్నుకుతుందేమోనని బెదురువుట్టేసింది నాకు.

లోపల్నించి మాటలినిపిస్తా ఉన్నాయి.

'ఏందంట వాడిదా?' అంటా ఉంది మా అమ్మ.

'పంది తాకిందంటలే. నువ్వేమీ అనబాక. అసలికే దడుచుకొని ఉన్నాడు బిడ్డ' అని బిందె నిండుగా నీళ్లు తెచ్చింది మా నాయినమ్మ.

'నీళ్లు బోస్తాను. పక్కకిరారే' అంటా నన్ను సైడు కాలవ దెగ్గిర నిలబెట్టింది.

'గుడ్డలిప్పబాక. అయికూడా తడవాలి' అని చెంబు నిండుగా నీళ్లు తీసుకునింది.

ఆ చెంబు కాణ్ణుంచి బిందెలోని నీళ్లయిపోయే ఆఖరి చెంబు దాకా... రెండు నిమిషాలకొక తడవ ఏందో మంత్రం చదవడం, ఆ మంత్రం తాలూకు మహిమని చెంబులోని నీళ్లలోకి యిడుస్తున్నట్టుగా 'ఫు...ఫు...' అని వూదడం, నా నెత్తిన కుమ్మరించడం... యిదే పని. (అప్పటికి ఏడు బావుల నీళ్లు పోసేంత చాదస్తం మా నాయినమ్మకు లాకపోవడం నాకు మంచిదయ్యింది. లాకుంటే అన్ని స్నానాలు చేయలాక సావలాక కాగితం నానినట్టుగా నానిపొయ్యుండే వాణ్ణి)

శుద్ది స్నానం వూర్తిగా ముగిసినాక తువ్వాలు తెచ్చిస్తా 'గుడ్డలాణ్ణే యిప్పేసి లోపలికి రా' అంది మా నాయినమ్మ. తువ్వాలు కట్టుకొని గుడ్డలి

ప్పేసినాక – కట్టెవుల్లతో వాటిని దూరానికి పైకెత్తి బావి కాడ తీసుకెళ్లి పడేసింది.

అంతటితో పంది తాకిందన్న బాద తీరి, దోషం పోయి, కత ముగిసిందని ఊపిరి పీల్చుకుంటా ఉంటే మా అమ్మ రంగప్రవేశం చేసింది.

'రా నాయినా రా... నీ కోసరమే చూస్తున్నా' అంది కట్టెత్తుకుంటా. ఆ కట్టెకి మా నాయినమ్మ అడ్డం పడింది.

'ఊరుకోమ్మే! వాడేమన్నా కావాలనిపోయి తాకొచ్చినాడా? దానిమీదకెక్కి డాన్సాడినాడా? అదే దానిపాటికొచ్చి మీదపడిందట' అంది.

అన్నాక – ఎందుకనో తమాషా పట్టేస్తున్నట్టుగా నవ్వింది.

'అయినా పందొచ్చి తాకిందంటే తాకదా? ఆ మాత్రం అన్నదమ్ముల ప్రేమ చూపదా? ఇదంతా మీ అవ్వ పెట్టిన దీవెన మహిమేగా' అంది మా అమ్మతో.

ఆ మాటలకు కట్టె అవతల పారేసి 'మొదలయ్యిందండి ఈమె గారి కిండలు' అని మూతి ముడుచుకుంటా వెళ్లిపోయింది మా అమ్మ.

మా నాయినమ్మ మళ్లా నవ్వింది!

ఆ నవ్వు చూసే సరికి యాడేందో పంది కతున్నట్టుందే అని అర్దమైపోయింది నాకు. ఆ రాత్రి సైగ్గా మా అమ్మ పక్కలో చేరినాను.

కాసేపు తాలినాక– 'సాయింత్రం ఏందిమా నీతో తమాషా చేస్తా ఉంది నాయినమ్మ... ఆ కతేందో చెప్పవా మా' అని బతిమిలాడినాను.

అప్పుడు మా అమ్మ ముసిముసిగా నవ్వి 'అది తమాషా కాదురా... నిజ్జంగానే మా వొంశానికి మా అవ్వ పెట్టిన చల్లటి దీవెన ' అని యీ కత చెప్పింది.

'యిది యిప్పటిది కాదులే... మా అమ్మ కూడా పుట్టనప్పటి కత. మా తాత (అమ్మ నాయిన) అల్లిసాయిబుది బాగా బతికిన వొంశం. అయితే ఆయన చిన్నతనంలోనే పెద్దలు సంపాదించిన ఆస్తులన్నీ కరిగిపోయినాయంట. పూటకు గతిలేని పరిస్థితి వచ్చిపడిందంట. సరిగ్గా ఆ టైములోనే మా అవ్వ మాహబీ (అల్లి సాయిబు సొంత అక్క) యిరవై ఏళ్లకే యిదవరాలై తమ్ముడి పంచన చేరింది. అప్పటికి మా తాత వొయసు ఎంతనీ? పదిహేడు సంవత్సరాలు. ఒక తట్టు యిదవరాలైన అక్క, యింకోతట్టు చేతగాని యిద్దరన్నల్ని చూసుకొని యింక తప్పని సరై ఇంటి బరువు నెత్తికెత్తుకున్నాడు మా తాత. మా అవ్వ కూడా మా తాతకు అక్కలా గాకుండా తల్లిలా కనిపెట్టుకొని ఉండిపొయ్యింది. అప్పట్నించి మా తాతకు మా అవ్వ మాట మీదనే గురి. ఆమె ఏమి చెబితే అదే చేసే వాడంట.

కొన్నాళ్లకు బంగారం పని నేర్చుకొని... నెమ్మదిగా నాలుగు గిరాకీలు పట్టి... పెళ్లయినాక సొంతంగా అంగడి పెట్టుకొని కొన్ని డబ్బులు కూడబెట్టినాడు మా తాత. ఆ డబ్బుతో ఇల్లు కొందామనుకొని వరవకట్ట కాడ ఒక యిల్లు బేరం చేసినాడు. అయితే యీ మాట అక్కతో చెప్పాలిగదా. అందుకని యింటికొచ్చి– 'అకా! యిట్టా ఒకిల్లు బేరానికొచ్చుంది. అయితే అది పందుల్ని పెంచే ఒడ్డోనిది. మనం చూస్తే సాయిబులమి. పందులు పొర్లాడిన అట్టాంటి ఇంటిని కొనాలా వద్దా? అని అనుమానంగా వుందకా–' అన్నాడంట.

అప్పుడు మా అవ్వ బాగా ఆలోచించి – నాయినా! వడ్డోని ఇల్లంటున్నావు... పందులు పొర్లాడాయంటున్నావు. యీ మాటలే నిజమైతే వెంటనే ఆ ఇల్లు కొనెయ్యి. పందుల కడుపు ఎంత చలవో ఆ యింట్లో పుట్టి పెరిగే నీ వొంశం కూడా అంతే చలవవద్ది. నీకు బిడ్డలు పుట్టి, వాళ్లకు బిడ్డలు పుట్టి ఒకరికి పదారుమందై నీ వొంశం కళకళలాడతది... అని దీవించిందంట. మా తాత యిల్లు కొనినాడు. మా అవ్వ దీవెన నిజమైంది. అప్పట్నించి మా వొంశంలో పిల్లల్లేని వాళ్లెవరూ లేరు. మా తాతకు నలుగురు కూతుర్లు పుట్టినారు. వారిలో ఒకొకరికి నలగరికి తక్కువ కాకుండా బిడ్డలు పుట్టినారు. మా అమ్మ ఆరుగురిని కంటే ఆమెకు పుట్టిన నేను మీ నాయిన పాలబడి నలగరిని కనియిడిచినాను. నాకు పుట్టిన నువ్వు రేపు పెద్దయినాక పెళ్లి చేసుకొని పుట్టాసాలగా మందిని కంటావు...' అని కత ముగించింది మా అమ్మ.

(మా అమ్మ చెప్పిన పంది చలవ కత ప్రకారం మా అమ్మోళ్ల అవ్వ అట్టాంటి దీవెనే యిచ్చుంటే ఇప్పుడామె ఆత్మ ఎంతగా క్షోభిస్తా ఉందో ఏమో! ఎందుకంటే ఒకరికి నలగర్ని కనే హయాము మా అమ్మ తరంతోటే అంతమయిపోయింది. ఇప్పడంతా కట్టే కట్టు. మా పిన్నికి యిద్దరు బిడ్డలు. కట్టు. మా పెద మేనమామకు యిద్దరు బిడ్డలు. కట్టు. చిన మేనమామకు ఒకడు పుట్టినాడు. యింకొకడు పుట్టకముందే కట్టోకట్టు అంటా ఉన్నాడు బార్యేనకపడి. మా పెదమ్మ కూతురికి కూడా యిద్దరే. యీళ్లనే ఏముంది మా అమ్మోళ్ల వొంశంలో మా తరం వోళ్లంతా ఒకరా? యిద్దరా? బాపతే. ఎవ్వడైనా తమాషాగా 'యింకొకర్ని కనకూడదా?' అంటే 'ఒకర్ని సాకే సరికే దేవుడు అవుపిస్తా ఉన్నాడు... యిద్దరు ముగ్గురు ఎందుకు నాయినా... కూటికీ గుడ్డకీ తనకలాడడానికా? నువు కూడా పెళ్లి చేసుకొని కను. అప్పుడు తెలుస్తుంది' అంటారు అక్కసుగా.

కనే సంగతి తర్వాత.

ముందసలికి పెళ్లి చేసుకోడానికే గతిలా!

సూర్యగోళం తీరువ రేట్లు మండిపోతా ఉన్న యీ కలిగ్గంలో మనబోటోళ్లు ఏం పెళ్లి చేసుకుంటారు? యింకేమి బిడ్డల్ని కంటారు? రాత!)

–మహమ్మద్ ఖదీర్‌బాబు



**PRAWN - C**
**PRAWN PICKLE**

రుచికరమయిన రొయ్యలపచ్చడి CIFT (Indian Council of Agricultural Research) సాంకేతిక సహాకారంతో **ESWARI FISHERIES** వారిచే తయారుచేయబడినది. ఇప్పుడు రెండు రుచులతో లభిస్తుంది. కారం ఎక్కువ తినే వారి కోసం **HOT & SPICY**, పులుపు ఇష్టపడే వారి కోసం **LEMON TASTY** మామూలు వాతావరణంలో 6 నెలలు పైబడి నిలువ ఉంటుంది. (ఫ్రిజ్‌లో పెట్టనవసరం లేదు). ధర కూడా అందుబాటులోనే 100 గ్రాII Packet Rs. 22/-(MRP) మరియు 200 గ్రాII Container Rs. 44/- మాత్రమే.

**WANTED AGENTS FROM UN REPRESENTED AREAS**
**CONTACT : MOBILE 0-98481-87691**

మీ పట్టణంలో లభ్యం కావటం లేదా? మాకు వ్రాయండి. **Courier / Regd. Post** ద్వారా మీ ఇంటికి మీరు ఆర్డరు చేసిన 10 రోజుల లోపు చేరుతుంది. మీరు చేయవలసిందల్లా ప్రతి 500 గ్రాII **packet** కి **Rs. 130/- (Rs. 20/- Postal / Courier charges** కలసి ఉన్నది). **M.O./D.D.** ని **M/s ESWARI FISHERIES** వారి పేరు మీద తీసి ఈ క్రింది ఇవ్వబడిన అడ్రస్‌కు దిగువ ఇవ్వబడిన వివరాలు నింపి పంపవలెను.

**ESWARI FISHERIES**
**P.O. BOX NO. 108,**
**VISAKHAPATNAM - 17**

**FILL THE FOLLOWING DETAILS AND SEND WITH ORDER**

Name :
D.No. :
Street :
Area :
Town :
Tel. No. :
Pin Code :

**PAYMENT PARTICULARS :**

D.D. / M.O. No. :
Date :
Signature :
Required Flavour :

HOT & SPICY LEMON TASTY